సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ సుందరీకరణలో భాగంగా దక్షిణ కొరియా సియోల్‌లో పర్యటించి తిరిగి వచ్చిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను శనివారం ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు కార్పొరేటర్ సాగర్‌గౌడ్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. సియోల్ నగరం కాలుష్య రహితంగా ఎలా అభివృద్ధి చేశారనే అంశాలపై చర్చించారు. అనంతరం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి దేవాలయం రహదారి గుంతలమయంగా మారి రోజూ గుడికి వచ్చే భక్తులకు ఇబ్బందికరంగా మారిందని సీసీ రోడ్డు కొరకు నిధులు మంజూరు చేయవలసిందిగా వారు కోరారు. కాలనీ నేతలు సంధ్య, ఎల్లెంకి సత్య, సురేష్‌రెడ్డి, హరి, సుబ్బరావు, మధుసూదన్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను వేరు చేసి ఇవ్వాలి



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లో ఉత్పన్నమయ్యే చెత్తను తడి, పొడిగా వేరు చేసి మీ ఇళ్ల దగ్గరకే వచ్చే స్వచ్ఛ ఆటోకు అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. శనివారం ఉదయం కొత్వాల్‌గూడలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కును ఆయన పరిశీలించారు. వారి పనితీరును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెత్త రహిత వీధులు, రోడ్లతో స్వచ్ఛ కార్పొరేషన్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తాం అన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ సిబ్బంది నరేందర్, రాము, యాదగిరి, రాకేష్, యాదమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కౌన్సిలర్ పద్మారావు

మణికొండ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మణికొండ పురపాలక సంఘం 7వ వార్డు కౌన్సిలర్ బి.పద్మారావు అన్నారు. శనివారం స్థానిక ది సిటిజెన్స్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో 7వ వార్డు పరిధిలోని ప్రజల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ, పార్కుల సంరక్షణ, అభివృద్ధి, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, వీధి కుక్కల సమస్య, రోడ్ల మరమ్మతు తదితర సమస్యలను ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌తో పాటు సిటిజన్ కౌన్సిల్ నాయకులు ఎ.లక్ష్మణ్ రావు, సయ్యద్ ఆరీఫ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయంతో కృషి చేస్తామన్నారు. వెంకటేశ్వరకాలనీ, పయనీర్ ఎస్టేట్, ఈవీవీ కాలనీ, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్, హ్యాపీ హోమ్స్ కాలనీ, గోల్డెన్ వ్యూస్ కాలనీ, గోల్కొండ హిల్స్ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన పెంచేందుకు కృషి



సాక్షి, సిటీబ్యూరో: తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులపై అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని వైద్య రంగ నిపుణులు సూచించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ నాల్గవ శనివారాన్ని జరుపుకోవడంలో భాగంగా తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్), శివరాంపల్లిలోని తమ ప్రాంగణంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా 'సికిల్ సెల్ వ్యాధి బారిన పడిన వారిలో సైకలాజికల్, సామాజిక సమస్యలు, వాటితో పోరాడటం' గురించి క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్.అజ్రా ఫాతిమా మాట్లాడారు. బాధితుల్లో శ్వాస వ్యాయామాలు, సానుకూల ఆలోచనలు వంటి అంశాలపై డాక్టర్ అజ్రా విశదీకరించారు. అదే విధంగా చంద్రకాంత్ అగర్వాల్, డాక్టర్ సుమన్ జైన్, అనితా ఉపాధ్యాయ, ప్రియదర్శిని తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా టీపీ, వ్యాక్సినేషన్ రోగులకు మందుల పంపిణీ నిర్వహించారు.

గౌలిపురాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

గౌలిపురా: గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆమె ఎస్.ఎస్. ఫ్లోరింగ్ పనులను (షాబాద్ బండల) ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలో షాబాద్ బండలు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని భక్తులు, ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో తాను జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.6.10 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు వి.ఎస్.గణేష్ గురుస్వామి, బీజేపీ నాయకులు ఆదర్శ మహేశ్, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, కొడి సురేందర్, కె.రాజ్ కుమార్, జమాల్‌పూర్ అశోక్, స్వప్న, బి.రమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలతో పరేషాన్

- మురుగు నీటితో రోడ్లపై ఏర్పడిన గుంతలు
- ప్రమాదాలబారిన వాహనదారులు
- ఆరు నెలలుగా ఇదే పరిస్థితి
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



డ్రైనేజీ నీరు పొంగి మధుబన్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు



మురుగు నీటి గుంతలలో వెళ్తున్న వాహనదారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న మురుగు నీటితో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడచిన ఆరు నెలలుగా రహదారిపై డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంతూ పరిసర ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటూ ఆరోపిస్తున్నారు. అవుట్ లెట్ లేదనే సమాధానంతో దాటవేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ ప్రధాన రహదారిలో గడచిన ఆరు నెలలుగా డ్రైనేజీల నుంచి మురుగు నీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. వాటిమీద రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు.
- ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులు గుంతలలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి గుండా నిత్యం బస్సులు, కార్లు, భారీ కంటెయినర్లతోపాటు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలు కాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కారణంగా గుంతలు పెద్దవిగా మారి వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రామ్‌చరణ్ ఆయిల్ మిల్ నుంచి మధుబన్ కాలనీ మూలవైపు వరకు గుంతలు ఏర్పడి అందులో మురుగు నీరు నిలుస్తున్నది. ఇకనైనా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి డ్రైనేజీతోపాటు రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కొత్త పైప్‌లైన్‌కు ప్రతిపాదించాం

ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీని సీజీఎంతో కలిసి పరిశీలించాం. రూ. 24 లక్షలతో ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధిలకు ప్రతిపాదనలు పంపించాం. అవుట్‌లెట్ లేనందునే డ్రైనేజీ పొంగుతోంది. నిధులు మంజూరు కాగానే నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తాం. అప్పటి వరకు డ్రైనేజీ నీటిని పక్కనే ఉన్న గుంతలోకి మళ్లించి రోడ్డపై మురుగునీరు నిలువకుండా చూస్తాం.

– సయ్యద్ సాదిక్, కాటేదాన్ జలమండలి మేనేజర్

గుంతలతో ఇబ్బంది పడుతున్నాం



మధుబన్ కాలనీ మూల మలుపులో డ్రైనేజీ నుంచి మురుగు నీరు పొంగి గుంతలు ఏర్పడ్డాయి. కారును గుంతల నుంచి నడుపడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కారు డ్యామేజీ అవుతున్నది. ద్విచక్ర వాహనదారులు గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకొని సత్వరమే డ్రైనేజీల నుంచి మురుగు నీరు రోడ్లపై రాకుండా చేసి... గుంతలను పూడ్చాలని కోరుతున్నా.

– అడికె రాజు, వాహనదారుడు

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం విపంచి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నృత్య నిర్వాణ కళాకారులు కామాక్షి ప్రదీప్, దీపశిఖ, పూర్ణిమ, తపస్వి, వేదం గాయత్రి, కావ్య ప్రమీల తదితరులు కౌత్వం, జతిస్వరం, సిద్ధివినాయకం, భామాకలాపం, పరులన్నమాట, బృందావనం తదితర అంశాలను ప్రదర్శించారు. అనంతరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శిల్పారామం ఆవరణలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ మిలటరీ సంయుక్త నిర్వహణలో మిలటరీ, పోలీస్‌బ్యాండ్‌ను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

సమస్యల పరిష్కారానికి యాక్షన్ కమిటీ



మాట్లాడుతున్న ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అవినాష్

మణికొండ: కాలనీలలో సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆయా కాలనీల సంక్షేమ సంఘాలతో పాటు ఆల్ కాలనీస్ ఫెడరేషన్‌తో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రణాళికాబద్ధంగా కృషి చేద్దామని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.అవినాష్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ, పయనీర్ ఎస్టేట్, స్పెక్ట్రమ్ విల్లాస్, లగోన్ విల్లాస్, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల ప్రజలతో స్పెక్ట్రమ్ విల్లాస్ క్లబ్ హౌస్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పలు కాలనీల వారు మాట్లాడుతూ... తమ కాలనీలలో డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, క్రీడా కేంద్రం, వ్యర్థ పదార్థాల నిర్వహణ, రోడ్ల మరమ్మతు, తాగునీటి సరఫరా లాంటి అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి ఆల్ కాలనీస్ ఫెడరేషన్ తన వంతు సహకారం అందించాలని కోరారు. దాంతో రాబోయే రోజుల్లో సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు. ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కోశాధికారి కాంతారావు, పయనీర్ కాలనీ అధ్యక్షుడు ఎస్.రవీందర్‌రెడ్డిలతో పాటు పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు శాన్వి



జాతీయ మెయిన్ డ్రాకు అర్హత సాధించిన శాన్వితో కోచ్ వేణు

మణికొండ: ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు మణికొండకు చెందిన శాన్వి లట్టాల ఎంపికయ్యింది. అసోం రాష్ట్రం డిబ్రుగర్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి జరుగుతున్న అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలలో ఆమె అద్భుత ప్రతిభ కనబరిచి 9 సంవత్సరాల అతి చిన్న వయసులో ఆల్ ఇండియా ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించి రికార్డు సృష్టించిందని అంకాపూర్ టౌన్‌షిప్‌లోని మ్యాచ్ పాయింట్ చైర్మన్, హెడ్ కోచ్ వేణు ముప్పాల తెలిపారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో అసోం క్రీడాకారిణి తనిష్క గోనవర్‌పై 15/11, 15/13 పాయింట్లతో విజయం సాధించి మెయిన్ డ్రాకు ఎంపికయ్యిందన్నారు. తన మొదటి అండర్ 13 ర్యాంకింగ్ టోర్నీలోనే సింగిల్స్, డబుల్స్ పోటీలలో మెయిన్ డ్రాకు ఎంపిక కావటం సామాన్య విషయం కాదన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులు జేబీఎస్ విద్యాధర్, బీవీఎస్‌కే లింగేశ్వర్‌రావు, అంపైర్ సంపతిరావు సూరిబాబులు శాన్విని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాన్వికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు.

'రోడ్డెక్కిన' కల్లు దుకాణం పంచాయితీ!

- వీధిలోనే విక్రయాలు నిర్వహిస్తున్న దుకాణదారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీకర్ సెక్షన్ కాలనీవాసులు
- నెలరోజులుగా రోడ్డు మీదే విక్రయాలు
- పట్టించుకోని అబ్కారీ శాఖ అధికారులు



వీకర్ సెక్షన్‌కాలనీ రోడ్డుపైనే జరుగుతున్న కల్లు విక్రయాలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ఓ ప్రధాన కల్లు దుకాణంలో సభ్యుల మధ్య నెలకొన్న వివాదం కాస్తా కల్లు విక్రయాలు రోడ్డుపైకి వచ్చాయి. గొడవల కారణంగా దాదాపు నెల రోజులుగా దుకాణం తెరవని విక్రయదారులు తమ దందాను మాత్రం యథేచ్ఛగా రోడ్డెక్కించారు. దాదాపు మూడు వందల మంది సభ్యులతో ఉన్న ఈ దుకాణంలో కొంతకాలంగా వ్యాపారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కొంతకాలంగా ఒకే దుకాణంలో రెండు వేర్వేరుగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ నిబంధనల మేరకు ఒక లైసెన్స్‌పై రెండు విక్రయ కేంద్రాలు నడిపిస్తున్న విషయం తెలుసుకున్న అబ్కారీ అధికారులు ఒక లైసెన్స్‌పై ఒకటే దుకాణం నడిపించాలని నిర్వాహకులకు హెచ్చరించారు. అధికారులు హెచ్చరించినా ఒకే చోట నడిపించుకునేందుకు ససేమిరా అంటున్న అందులోని కొందరు వ్యాపారులు నెలరోజులుగా దుకాణాన్ని మూసేసి రైల్వేస్టేషన్ నుంచి వీకర్ సెక్షన్ కాలనీ మీదుగా ఉన్న రోడ్డుపైనే అనధికారికంగా దుకాణాన్ని నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైనే కల్లు అమ్ముతున్నందున తాగుబోతులు కాలనీ పరిసరాల్లోనే ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నారంటూ వాపోతున్నారు. రోడ్డుపైనే కల్లు విక్రయాలు జరుగుతున్నా తరచూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులతో పాటు ఎక్సైజ్ అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇకనైనా అధికారులు రోడ్డుమీద జరుగుతున్న విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధం

రోడ్డుపై కల్లు విక్రయాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధం. ఈ అంశం మా దృష్టికి రాలేదు. వెంటనే మా సిబ్బందిని పంపి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు లోబడే విక్రయాలు జరపాలి. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– దేవేందర్‌రావు, శంషాబాద్ ఎక్సైజ్ సీఐ

పీడీపీ చౌరస్తా వద్ద బారికేడ్ల ఏర్పాటు

- ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసులు శనివారం డివైడర్‌ను ఏర్పాటు చేశారు. జన చైతన్య వెంచర్, గోల్డెన్ హైట్స్ నుంచి వాహనాలను నేరుగా పీడీపీ చౌరస్తా ప్రధాన రహదారిపైకి రాకుండా తగు ఏర్పాట్లను చేపట్టారు. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే సబ్ రోడ్డు గుండా ముందుకు వెళ్లేందుకు రోడ్డు మధ్యలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ చౌరస్తా వైపు వాహనాలు వస్తుండటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీని పరిష్కారం కోసం శనివారం బారికేడ్లను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తీరింది.

రాంగ్ రూట్ వాహనాలపై చర్యలు తీసుకోవాలి...

పీడీపీ చౌరస్తా ప్రాంతంలో రాంగ్ రూట్‌పై ఎక్కువగా వాహనాలు వస్తుండటంతో తరుచూ ప్రమాదాలు జరగడంతో పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. ఇక్కడే ప్రధాన హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, బస్టాపులు ఉండటంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. రాంగ్ రూట్‌లో మూడు దిక్కుల నుంచి ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిని నియంత్రిస్తే స్థానికంగా ఎలాంటి సమస్య ఉండదని పరిసర ప్రాంతాలవాసులు వెల్లడిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఈ విషయాన్ని గమనించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్ఎంసీలను మూయించాలని వినతి



కాలుష్య నియంత్రణ మండలి అధికారికి వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

మణికొండ: జనావాసాలకు పక్కనే ఉండి రాత్రి, పగలు తేడా లేకుండా శబ్ద, వాయు కాలుష్యాన్ని వెదజల్లుతున్న రెడీమిక్స్ ప్లాంట్‌లు, క్రషర్‌లను తొలగించాలని నివాసితులు డిమాండ్ చేశారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా గేటెడ్ కమ్యూనిటీల ముందు వాసవి అట్లాంటిక్ నిర్మాణ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంసీ ప్లాంట్లను నిర్వహిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని పలు మార్లు ఫిర్యాదులు చేశారు. దాంతో శనివారం కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి వెంకట్ స్థానికంగా పర్యటించి వాటి నుంచి వస్తున్న కాలుష్యం, శబ్దం, వాటి వాహనాలు తిరగటంతో పాడైన రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారం రోజుల్లో వాటిని తొలగించకపోతే తామంతా రోడ్డెక్కి ఆందోళనకు దిగాల్సి వస్తుందని ఆయనకు స్పష్టం చేశారు. ఆయా గేటెడ్ కమ్యూనిటీల సంక్షేమ సంఘాల నాయకులు గౌతంరెడ్డి, నివాసితులు పాల్గొన్నారు.